ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

ఆదివారం 7 జనవరి 2024

నేడు పుట్టపర్తికి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రాక

పుట్టపర్తి, జనవరి 6: సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ ఆదివారం పుట్టపర్తికి రానున్నారు. మధ్యాహ్నం 1.10 గంటలకు బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన బయలు దేరి సాయంత్రం 4.10గంటలకు ప్రశాంతి నిలయం చేరుకుంటారు. 5గంటలకు సాయికుల్వంత్ హాల్లో సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటారు. రాత్రికి అక్కడే శాంతిభవనంలో బస చేస్తారు. తిరిగి సోమవారం ఉదయం 9గంటలకు సత్యసాయి మహాసమాధిని మరోమారు దర్శించుకుని అనంతరం బెంగళూరుకు పయనమవుతారని అధికార వర్గాలు ఆదివారం తెలిపాయి.



- పోటీలకు ఉత్సాహంగా తరలి వచ్చిన మహిళలు
- పురంలో ఆంధ్రజ్యోతి -ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు
- విజేతలకు బహుమతులను అందించిన నందమూరి వసుంధరదేవి



ప్రథమ బహుమతిని అందజేస్తున్న వసుంధరదేవి, లోకేశ్వరి





ఇలపై.. ఇంద్ర ధనుస్సు..

ముగ్గులతో మురిపించిన నారీమణులు

సంస్కృతికి అద్దం పట్టేలా రంగవల్లులు



హిందూపురం, జనవరి 6: పట్టణంలోని ఎంజీఎం క్రీడామైదానం ముత్యాల ముగ్గులతో మురిసిపోయింది. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్ట్నర్ స్వర్గసీమ సుకేతన'కు విశేష స్పందన లభించింది. రంగు రంగుల ముగ్గులు వేసేందుకు మహిళలు ఉత్సాహంగా తరలివచ్చారు. ముందే వచ్చిన సంక్రాంతిని చూసేందుకు పట్టణ ప్రజలు తరలివచ్చారు. ఏటా సంక్రాంతి సందర్భంగా ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలకు నిర్వహించడాన్ని పాఠకులు, ప్రజలు అభినందించారు. ఈ వేడుకలో గంగిరెద్దులు, హరిదాసు సంకీర్తనలు, గాలిపటాలు, కోలాటాలు, గొబ్బెమ్మలు, పాలు పొంగించడం, చెరుకు మోసులు, అనపకాయలు, వేరుశనగకాయల అలంకరణ, శివలింగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పోటీలలో 304 మంది మహిళలు పాల్గొన్నారు. చిన్నారులు చిట్టి చేతలతో రంగవల్లులు వేశారు. మహిళలు కొంగు బిగించి అందాల హరివిల్లులను ఆవిష్కరించారు. న్యాయ నిర్ణేతలు సరస్వతి వెంకటేశ్, రాజేశ్వరి కుమార్, శ్రీలక్ష్మి, లక్ష్మి అన్ని ముగ్గులను క్షుణ్ణంగా పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. మొదటి బహుమతిని హిందూపురం పట్టణంలోని మోడల్ కాలనీకి చెందిన ఉమాదేవి దక్కించుకున్నారు. రెండో బహుమతి పెనుకొండకు చెందిన శ్రీదేవి, మూడో బహుమతి పెనుకొండకు చెందిన పద్మావతి గెలుచుకున్నారు. వీరికి నందమూరి వసుంధరదేవి నగదు బహుమతులు, ప్రత్యేక బహుమతులను అందజేశారు. మరో పదిమందికి అతిథులు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న వసుంధరదేవి, అంబికా లక్ష్మీనారాయణ

నందమూరి వసుంధరదేవి

ప్రతి ఏటా ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండగకు ముందు ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి అన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను ఆంధ్రజ్యోతి, ఏబీఎన్‌వారు భావి తరాలకు అందిస్తున్నారని కొనియాడారు. వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్టీకే సేవా సమితి ట్రస్ట్ వారు స్థానికంగా సహకారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందూపురానికి వారం ముందే సంక్రాంతి శోభ వచ్చిందని అన్నారు. ముగ్గులను చూస్తుంటే చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయని అన్నారు. అప్పట్లో సంక్రాంతి పండగను ఎంతో గొప్పగా జరుపుకునేవారమని, ప్రస్తుతం అలాంటి పండగ హిందూపురంలో నేడు చూశానని అన్నారు. ఎంజీఎం మైదానంలో ఇంద్ర ధనస్సును తలపించేలా ముగ్గులు ఉన్నాయని అన్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ పోటీలో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. ముగ్గులను చూస్తుంటే ఎవరికి బహుమతి ఇవ్వాలో ఎంపిక చేయడం కష్టసాధ్యమేనని అన్నారు. మైదానంలో ఉన్న ముగ్గుల రంగులన్నీ తన చీర రంగలను పోలి ఉన్నాయని చమత్కరించారు. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఇలాంటి కార్యక్రమాలు మున్ముందు మరిన్ని నిర్వహించాలని, తమవంతు సహకారం అందిస్తామని అన్నారు.



ప్రసంగిస్తున్న వసుంధర దేవి

చాలా ఆనందంగా ఉంది..

- లోకేశ్వరి తనయుడు శ్రీనివాస్ మాట్లాడుతూ, హైదరాబాద్ నుంచి హిందూపురానికి వచ్చామని, ఇక్కడ రంగవల్లులు చూసి చాలా ఆనందం వేసిందని అన్నారు. తను చిన్నప్పుడు తమ ఇంటి ముందు ఇలాంటి ముగ్గులను వేస్తుండేవారని, ఆ తరువాత ఇప్పుడే ఇలాంటి రంగవల్లులు చూస్తున్నానని హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలకు అందరూ సహకరించాలని కోరారు. ఈ రంగవల్లులను నందమూరి బాలక్రిష్ణ చూసి ఉంటే మరింత ఆనందం వ్యక్తం చేసేవారని అన్నారు.

- ఒకప్పుడు ముగ్గుల పోటీల్లో పాల్గొని బహుమతులను గెలుచుకున్నామని, హిందూపురంలో ముగ్గుల పోటీలు ఆ రోజులను గుర్తుకు తెచ్చాయని బెంగళూరు నుంచి వచ్చిన అతిథి సుభాషిణి అన్నారు. అపార్ట్‌మెంట్ సంస్కృతి వచ్చాక ముగ్గులు మరిచిపోయామని, ఇలాంటి పరిస్థితుల్లో ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ వారు ముగ్గుల పోటీలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

కార్యక్రమంలో టీడీపీ హిందూపురం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, ఆయన సతీమణి శ్యామల, ఆంధ్రజ్యోతి బీఎం గోపాల్ నాయుడు, ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టర్ సురేష్, ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ శంకర్, నాయకులు డాక్టర్ సురేంద్ర, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ లక్ష్మి, బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేవనహళ్లి ఆనంద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్ పాల్గొన్నారు.

భోగి పండుగ గుర్తొచ్చింది: లోకేశ్వరి




ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహించిన ముగ్గుల పోటీలలో రంగవల్లులు తనకు భోగి పండుగను గుర్తుకు తెచ్చాయని ఎమ్మెల్యే బాలకృష్ణ సోదరి గారపాటి లోకేశ్వరి అన్నారు. చిన్నప్పుడు భోగి పండగ వస్తే రాత్రంతా మేలుకుని, తెల్లవారక మునుపే ఇళ్లముందు ముగ్గులు వేసేవారమని, ఆ రోజులు గుర్తుకొస్తున్నాయని అన్నారు. ఒకరికంటే ఒకరు మిన్నగా ముగ్గులు వేశారని అభినందించారు. మన సంస్కృతి సంప్రదాయాలు మరిచిపోతున్న తరుణంలో ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ భావి తరాలకు రంగవల్లుల సంస్కృతిని అందించాలని సంకల్పించారని, ఆయనకు ధన్యవాదాలు అని తెలిపారు.



మొదటి బహుమతికి ఎంపికైన ముగ్గును వేస్తున్న కె. ఉమాదేవి



రెండో బహుమతికి ఎంపికైన ముగ్గును వేస్తున్న శ్రీదేవి



మూడో బహుమతికి ఎంపికైన ముగ్గును వేస్తున్న పద్మావతి



ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులు అందజేస్తూ..





ముగ్గు వేస్తోన్న వసుంధర..



తరలివచ్చిన పురం ప్రజలు



న్యాయనిర్ణేతలు..

సహకారమేనా?



మక్బూల్ అహమ్మద్

కదిరి వైసీపీ ఇన్‌చార్జిగా మక్బూల్ అహమ్మద్

కొత్త ఇన్‌చార్జికి వైసీపీ శ్రేణులు సహకరించేనా..?

- మిగతా నాయకుల మద్దతు దొరుకుతుందా?
- కష్టపడినా ఫలితం లేదని కొందరి నిర్వేదం
- అధిష్ఠానం చర్యలతో మారిన కదిరి రాజకీయం



ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి, జనవరి 6: వైసీపీ అధిష్ఠానం చర్యలతో కదిరి నియోజకవర్గ ంలో రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. ఇప్పటికే నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జ్‌గా బీఎస్ మక్బూల్ అహమ్మద్‌ను పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. ఈనేపథ్యంలో ప్రస్తుతం వైసీపీలో ఉన్న గ్రూపులు ఆయనకు సహకరిస్తాయా లేక ధిక్కరిస్తాయా అన్న చర్చ మొదలైంది. ముఖ్యంగా ఎమ్మెల్యే సిద్దారెడ్డితోపాటు, ఆయన వర్గీయుల వైఖరి ఎన్నికల్లో ఎలా ఉంటుందో అన్న చర్చ నడుస్తోంది. అయితే ఎమ్మెల్యే సిద్దారెడ్డిని వ్యతిరేకిస్తున్న వారైనా కొత్త ఇన్‌చార్జికి పూర్తిగా సహకరిస్తారా అనే ప్రశ్న తలెత్తుతోంది. అలాగే ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా రాజీనామాలు చేసిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల దారి ఎటని ప్రజలు చర్చించు కుంటున్నారు.

రియల్ వ్యాపారం నుంచి రాజకీయాల్లోకి...

కదిరి వాసి అయిన మక్బూల్ అహమ్మద్ వ్యాపారరీత్యా బెంగళూరులో ఉంటున్నారు. ఈయన మక్కాకు వెళ్లేవారికి విమాన టిక్కెట్లు ఏర్పాటు చేసే ఏజెన్సీని మొదట ప్రారంభించినట్లు సమాచారం. తరువాత రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్లు తెలిసింది. కొంతమంది స్నేహితులు మక్బూల్ అహమ్మద్‌ను మంత్రి పెద్దిరెడ్డికి పరిచయం చేయడం, ఆ క్రమంలోనే ఆయన కదిరి టికెట్ అడిగినట్లు సమాచారం. దీంతో వైసీపీకి మైనార్టీ అభ్యర్థి అవసరమని అధిష్ఠానం ఆలోచించి మక్బూల్ అహమ్మద్‌కు ఇన్‌చార్జిగా అవకాశ మిచ్చినట్లు తెలిసింది.

రాజీనామా నేతల దారెటు?

ఎమ్మెల్యే సిద్దారెడ్డికి వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ లేదంటూ వార్తలు వచ్చిన నేపథ్యంలో ఆయన వర్గీయులుగా ఉన్న స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు రాజీనామాలు చేశారు. ఇన్‌చార్జిగా మక్బూల్ అహమ్మద్‌ను ప్రకటించిన తరువాత వీరి దారెటో అర్థం కాని పరిస్థితి. రాజీనామాలు వెనక్కు తీసుకుని ఇన్‌చార్జికి సహకరిస్తారో లేక సిద్దారెడ్డితోపాటు ఉంటారో తెలియాల్సి ఉంది. రాజీనామాలు ఆమోదించినా, మెట్టు దిగమని ఇప్పటికే పలువురు రాజీనామాలు చేసిన ప్రజాప్రతినిధులు చెబుతుండటం గమనార్హం.

మిగతా గ్రూపుల పరిస్థితి ఏమిటో?

ఎమ్మెల్యే సిద్దారెడ్డితో విభేదించే వైసీపీలోని పూల శ్రీనివాస రెడ్డి, బత్తల హరిప్రసాద్, బాహుద్దీన్, పవన్‌కుమార్‌రెడ్డి తదితర నాయకులందరూ ఇన్‌చార్జి మక్బూల్‌బాషాకు సహకరిస్తారా లేదా అన్న చర్చ సాగుతోంది. పూల శ్రీనివాసరెడ్డిని ఇప్పటికే మక్బూల్ అహమ్మద్ కలిసి వచ్చినట్లు తెలిసింది. ఆయన పూర్తి మద్దతు తెలిపినట్లు సమాచారం. అయితే ఆయన ప్రధాన అనుచరుడు శంకర్‌వీరప్రసాద్ నెలరోజుల క్రితమే టీడీపీలో చేరిపోయారు. దీంతో ఆయన బలం పూర్తిగా తగ్గిందనే చర్చ నడుస్తోంది. తలుపుల ఎంపీపీ ఎన్నికల్లో పూల శ్రీనివాసరెడ్డి రాజకీయ వ్యూహం లేని వ్యక్తిగా గుర్తింపు పొందారని, ఆయన మక్బూల్ అహమ్మద్‌తో ఉన్నాకూడా వైసీపీకి పెద్దగా లాభం లేదనే మాటలు వినిపిస్తున్నాయి. బత్తల హరిప్రసాద్, బాహుద్దీన్, పవన్ కుమార్‌రెడ్డి దారి ఎటో తెలియాల్సి ఉంది.

కదిరి ఎమ్మెల్యేగా వైసీపీకి చెందిన డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పదవిలో ఉండగానే మక్బూల్ అహమ్మద్‌కు నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. వచ్చే ఎన్నికల్లో మక్బూల్‌బాషాకే టిక్కెట్ కేటాయిస్తారని ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యంలో సిద్దారెడ్డి వర్గీయులు గత కొన్నిరోజులుగా ఆగ్రహంగా ఉన్నారు. ఇన్‌చార్జిగా మక్బూల్‌బాషాను ప్రకటించిన మరుసటి రోజే ఆయన ఎమ్మెల్యే సిద్దారెడ్డిని కలిసినట్లు తెలిసింది. తనకు సహకరించాలని, ఇద్దరం కలిసి

ఎమ్మెల్యే సహకరించేనా ?

పనిచేద్దామని, అందుకు మీసహకారం అవసరమని అడిగినట్లు సమాచారం. ఇందుకు ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఆల్‌ది బెస్టు అని ఒక్క ముక్కలో చెప్పి బయటకు పంపినట్లు తెలిసింది. ఈక్రమంలో అధిష్ఠానం ఆదేశించినా ఎమ్మెల్యే ఇన్‌చార్జితో కలిసి పనిచేస్తారా అన్నది డౌటే. ఎమ్మెల్యేని కలుస్తారా అన్న ప్రశ్నకు, తాను ఎవరికి కలవనని, అవసరమైతే వారే మాఇంటికొస్తారని ఇన్‌చార్జి మక్బూల్ అహమ్మద్ గతంలో సమాధానం చెప్పినట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో ఇద్దరి మధ్య సయోధ్య కుదురుతుందా అనేదికూడా సందేహమే. సిద్దారెడ్డి ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ నాయకులతో చర్చలు జరిపారన్నది సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. పార్టీ వీడుతారా, వైసీపీతో కలిసి ఉంటారా అన్నది వేచి చూడాల్సిందే. మరో 15రోజులపాటు ఈనిశబ్దం కొనసాగుతుందని సమాచారం.

కష్టమే మిగిలింది

వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడిన వారికి చివరికి కష్టమే మిగిలిందని ఆపార్టీ నాయకులు నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు. పూల శ్రీనివాసరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, బత్తల హరిప్రసాద్, బాహుద్దీన్, ఇస్మాయిల్ తదితరులు పార్టీ కోసం తొలి నుంచి అహర్నిశలు కష్టపడ్డారు. ఆర్థికంగా నష్టపోయారు. ఎమ్మెల్యే సిద్దారెడ్డిని కాదంటే తమలో మరో నాయకుడికి ఇన్‌చార్జిగా ఇవ్వాలని, మైనార్టీకే పార్టీ ఇన్‌చార్జి పదవి ఇవ్వాలనుకుంటే బాహుద్దీన్, ఇస్మాయిల్‌తోపాటు మరికొంతమంది మైనార్టీ నాయకుల్లో ఎవరికో ఒకరికి ఇచ్చి ఉంటే బాగుండేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఎస్మాకు బెదిరేది లేదు

ప్రభుత్వానికి అంగన్‌వాడీల హెచ్చరిక.. పెనుకొండలో మంత్రికి సమ్మె సెగ

పుట్టపర్తి/పెనుకొండ, జనవరి 6: ప్రభుత్వం అణచివేయాలని చూస్తే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని అంగన్‌వాడీలు హెచ్చరించారు. తమపై ఎస్మాను ప్రయోగించేందుకు జీవో నంబర్ 2ను తీసుకురావడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా 26వ రోజు నిరసనలు కొనసాగించారు. పెనుకొండ పర్యటనకు వచ్చిన మంత్రి ఉష శ్రీచరణ్‌కు సమ్మె సెగ తగిలింది. ఆమెకు వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నించినవారిని పోలీసులు నిర్దాక్షిణ్యంగా తోసేశారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో అంగన్‌వాడీ కార్యకర్త నారాయణమ్మ గాయపడ్డారు. ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో అంగన్‌వాడీలు మరింత ఆగ్రహించారు. గణేష్ కూడలిలో జీవో ప్రతులను దహనం చేశారు. ఎస్మాను ప్రయోగించినా భయపడేది లేదని, వెంటనే ప్రభుత్వం జీవో నంబర్ 2ను వెనక్కు తీసుకోవాలని యూనియన్ కోశాధికారి శ్రీదేవి డిమాండ్ చేశారు. లేదంటే దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాల మద్దతు కూడగట్టుకుని సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తమ న్యాయమైన డిమాండ్లను అంగీకరించడం మానేసి, ఎస్మాను ప్రయోగిస్తారా అని మండిపడ్డారు. ధర్మవరంలో కోకో ఆడుతూ, సోమందేపల్లి, హిందూపురంలో పొర్లుదండాలు పెడుతూ నిరసన తెలిపారు. అగళిలో హోమం నిర్వహించారు. గోరంట్లలో ఉపవాస దీక్షతో నిరసన తెలిపారు.



పెనుకొండ ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష



పోలీసుల తోపులాటలో గాయపడ్డ నారాయణమ్మను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం



సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలు



మంత్రి ఉషకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అంగన్ వాడీలు



పుట్టపర్తిలోని గణేష్ సర్కిల్‌లో జీవో ప్రతుల దహనం


గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న వీసీ రంగజనార్దన


గవర్నర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న వీసీ, వర్సిటీ అధికారులు


విద్యార్థులకు బంగారు పతకాలు, పట్టాలను ప్రదానం చేస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్


8 గోల్డ్‌మెడల్స్ సాధించిన దాసరి శాంతిని అభినందిస్తున్న వీసీ


బంగారు పతకాలు, పట్టాలు అందుకుంటున్న బీటెక్ విద్యార్థులు


గోల్డ్‌మెడల్స్‌తో పాటు పట్టాలు అందుకుంటున్న బీటెక్ విద్యార్థులు


పీహెచ్‌డీ పట్టాలను అందుకున్న విద్యార్థులు


పీహెచ్‌డీ పట్టాలతో ఆనందం..


స్నాతకోత్సవ వేదికపై గవర్నర్, వీసీ, ఇతర అధికారులు


ప్రముఖుల మాటామంతి


పీహెచ్‌డీ పట్టా తీసుకునేందుకు చంటిబిడ్డతో..

విద్యార్థులే భవిష్యత్తు నిర్మాతలు


మెడల్స్ వచ్చిన సంతోషాన్ని కుటుంబ సభ్యులతో పంచుకుంటున్న విద్యార్థిని

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

జేఎన్‌టీయూ 13వ స్నాతకోత్సవంలో

గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

అనంతపురం సెంట్రల్, జనవరి 6: భవిష్యత్ నిర్మాతలు మీరేనని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ విద్యార్థులనుద్దేశించి అన్నారు. నైపుణ్యం, సృజనాత్మకతను నిరంతరం పెంపొందించుకోవాలని సూచించారు. జేఎన్‌టీయూ 13వ స్నాతకోత్సవం శనివారం వర్సిటీలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో జరిగింది. ఈ వేడుకకు వర్సిటీ చాన్స్‌లర్ హోదాలో గవర్నర్ హాజరయ్యారు. ఆయనకు సాంకేతిక విద్యా కమిషనర్ నాగరాణి, కలెక్టర్ గౌతమి, వీసీ రంగజనార్దన, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శశిధర్ ఘనస్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ భవిష్యత్ నిర్మాతలు విద్యార్థులేనన్నారు. అభివృద్ధి వేగంగా జరుగుతోందని, ఇందులో ప్రధాన భూమిక ఇంజనీర్లదేనన్నారు. వర్సిటీలో నేర్చుకున్న విద్యతో నూతన ఆవిష్కరణలు సాధ్యమన్నారు. ఎప్పటికప్పుడు నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ ముందుకుసాగాలని సూచించారు. నూతన ఆవిష్కరణలు సమాజానికి దోహదపడేలా ఉండాలన్నారు. సవాళ్లను స్వీకరించి వాటి పరిష్కారానికి మార్గాలను చూపాలన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మీ ఉన్నతికి మీరే పాటుపడాలన్నారు. ప్రపంచంలోనే మన విద్యావ్యవస్థ పెద్దదన్నారు. వికసిత్ భారత్-2047 లక్ష్యాన్ని చేరేందుకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

బానిసత్వం నుంచి ఆత్మనిర్భర్ వైపు..

భారతదేశం వెయ్యి సంవత్సరాల బానిసత్వం నుంచి ఆత్మనిర్భర్‌వైపు నడుస్తోందని. ఈ ప్రయాణంలో ప్రతిఒక్కరి పాత్ర ఉందని ట్రాయ్ మాజీ సభ్యులు, డీఆర్‌డీఓ, నావల్ రీసెర్చ్‌బోర్డ్ మాజీ ఛైర్మన్ డాక్టర్ సత్యనారాయణరాజు పేర్కొన్నారు. ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థానాన్ని చేరేందుకు కృషిచేయాలని విద్యార్థులకు సూచించారు. వృత్తిపరమైన విజయమే మీరు అభ్యసించిన విద్యకు నిదర్శనమన్నారు. అనంతరం వీసీ రంగజనార్దన వర్సిటీ అభివృద్ధి అంశాలను వివరించారు. డీఓజీ మాజీ ఛైర్మన్, ఎస్‌వి టీకే మాజీ వీసీ ప్రొఫెసర్ కె.బలవీరారెడ్డికి గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ అందజేశారు. అదేవిధంగా విద్యార్థులను బంగారు పతకాలతో సత్కరించి పట్టాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పలువురు ఉన్నతాధికారులు, వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులతో తరలివచ్చి...

కష్టపడి చదివిన ఫలితం పట్టాల రూపంలో అందుకున్న వేళ విద్యార్థులు ఆనందంతో గంతేశారు. శనివారం నిర్వహించిన స్నాతకోత్సవానికి విద్యార్థులు వారి కుటుంబసభ్యులతో తరలివచ్చారు. అదేవిధంగా పీహెచ్‌డీ తీసుకునేందుకు కొందరు వారి పిల్లపాపలతో హాజరై సంతోషాన్ని పంచుకున్నారు. బీటెక్ ఇంజనీరింగ్‌లో ఉత్తమ మార్కులు సాధించి ఏకంగా ఎనిమిది గోల్డ్‌మెడల్స్‌ను కైవసం చేసుకున్న దాసరి శాంతికి వీసీ రంగజనార్దన, రిజిస్ట్రార్ శశిధర్ పతకాలను అందజేసి అభినందించారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని ఢిల్లీ యూనివర్సిటీలో ఫుడ్ టెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కొదండరామిరెడ్డి తన భార్య, చంటిబిడ్డతో వచ్చి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. మరో విశేషమేమంటే వీసీ రంగజనార్దన, రెక్టార్ విజయకుమార్, శ్రీనివాస్ అనంతపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1981-83లో ఇంటర్మీడియేట్ అభ్యసించారు. జేఎన్‌టీయూలో 1983-87లో రంగజనార్దన బీటెక్ మెకానికల్, శ్రీనివాస్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ పూర్తిచేశారు. విజయకుమార్ నెల్లూరు ఎన్‌బీకేఆర్‌లో బీటెక్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ చదివారు. క్లాస్‌మేట్స్ అయిన రంగజనార్దన, విజయకుమార్ చేతులమీదుగా శ్రీనివాస్ పీహెచ్‌డీ పట్టా అందుకోవడం అందరినీ ఆకట్టుకుంది. కాగా శ్రీనివాస్ ప్రస్తుతం ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో వైస్‌ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. మరోవైపు ఆడిటోరియం ముందున్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద చిన్నారులు ఫొటోలు దిగారు.

కృషి, పట్టుదలతో చదవాలి


బహుమతుల ప్రదానోత్సవంలో వక్తలు


మొదటి బహుమతిని అందజేస్తున్న ముఖ్య అతిథులు

కొత్తచెరువు, జనవరి 6: కృషి, పట్టుదలతో చదవాలని పలువురు వక్తలు సూచించారు. వధన్యా జనసొసైటీ ఆధ్వర్యంలో డిసెంబరు 17న ప్రతిభా టాలెంట్ టెస్టును నిర్వహించారు. ఇందులో 35 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వారికి బహుమతుల ప్రదాన కార్యక్రమం శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ విశాలఫెర్రర్, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, హెచ్‌సీఎల్ కంపెనీ ప్రెసిడెంట్ విజయానంద్, రచయిత ఎస్కే లెనిన్ ముఖ్య అతిథులుగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మనిషి జీవన విధానాన్ని మార్చేది చదువేనన్నారు. ప్రస్తుతం విద్య, వైద్యం వ్యాపారంగా మారాయని పేద, మధ్య తరగతి వారికి అందని దాక్షలా మారుతున్నాయన్నారు. ఆర్డీటీ పేద విద్యార్థులకు విద్యను అందిస్తూ వారి జీవితాల్లో వెలుగు నింపుతోందని కొనియాడారు. అదే బాటలోనే వధన్యా జనసొసైటీ నడుస్తోందన్నారు. విద్యార్థుల్లో దాగున్న ప్రతిభను వెలికి తీసేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రథమస్థానం సాధించిన ధర్మవరం బీఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి జుగేష్‌కుమార్‌కు రూ. 15వేల ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ద్వితీయ, తృతీయ స్థానాల్లో యశ్వంత్‌కుమార్‌రెడ్డి, తులసీకార్తీక్ నిలిచారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను అతిథులు అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకుడు పడపాటి అశోక్, సభ్యులు పాల్గొన్నారు.

జీతాలు ఇస్తే సమ్మె విరమిస్తాం

తేల్చిచెప్పిన శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు


కార్మికులతో చర్చలు జరుపుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ

కళ్యాణదుర్గం, జనవరి 6: జీతాలు ఇస్తేనే సమ్మె విరమిస్తామని శ్రీరామిరెడ్డి కార్మికులు తేల్చిచెప్పారు. కళ్యాణదుర్గం పంప్‌హౌస్ వద్ద నిరసనలు చేపడుతున్న శ్రీరామిరెడ్డి కార్మికులతో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు శనివారం చర్చలు జరిపారు. ఫేస్-1 కింద పనిచేస్తున్న కార్మికులకు జీతాలు మంజూరు చేశారని తమకు ఎందుకు ఇవ్వలేదని డీఈ దృష్టికి తీసుకెళ్లారు. తమకు జీతాలు మంజూరు చేశాకే సమ్మె విరమిస్తామన్నారు. సోమవారంనాటికి పూర్తిస్థాయిలో జీతాలు ఇచ్చేలా చూస్తానని డీఈ కార్మికులకు హామీ ఇచ్చారు. కాగా సమ్మె ప్రభావంతో సుమారు 325 గ్రామాలకు తాగునీటి సరఫరా ఆగిపోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తారస్థాయికి వర్గవిభేదాలు

- కలిసిరాని నేతలు
- పెనుకొండలో ఎమ్మెల్యే వర్గం దూరం
- పురంలో సొంత సామాజికవర్గం నేతలు ఎక్కడ
- నాడు సమ్మతి నేడు అసమ్మతి
- బదిలీలు చేసినా ఫలితం ఏది



హిందూపురం, జనవరి 6: రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీల బదిలీల ఆట ఆడిస్తోంది. గత నాలుగున్నరేళ్లుగా సిట్టింగులపై తీవ్ర వ్యతిరేకత పెల్లుబుకుతోంది. ఈ నేపథ్యంలో జగన్మోహన్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు ఆ పార్టీకి చేటు తెప్పిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో జగన్ తీరు మార్చుకోకపోగా సిట్టింగ్‌లపై మోపడంతో సర్వేల పేరుతో సిట్టింగులను కొన్నిచోట్ల మార్చారు, మరికొన్నిచోట్ల బదిలీచేశారు. దీనికితోడు అధికార పార్టీలో అన్ని నియోజకవర్గాల్లోనూ అసమ్మతి సెగలు వర్గవిబేధాలు తారస్థాయికి చేరాయి. ఈ పరిస్థితుల్లో ఇన్‌చార్జ్‌లను మార్చినా ఫలితం లేకుండా పోతోందని సొంత పార్టీ నాయకులే విమర్శలు గుప్పిస్తున్నారు.

పెనుకొండలో ఎమ్మెల్యే వర్గం దూరం

పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన శంకర్‌నారాయణకు మూడేళ్లకుపైగా అసమ్మతి సెగ మొదలైంది. అధికార పార్టీకి ఓ బలమైన సామాజిక వర్గం నేతలపై శంకర్‌నారాయణ అక్రమ కేసులు పెట్టించారని ఆ సామాజిక వర్గం నాయకులు ఆయనపై, అతని సోదరులపై గుర్రుగా ఉన్నారు. ఎలాగైనా శంకర్‌నారాయణను తప్పించాలని అధిష్ఠానం వద్ద ఆయన వ్యతిరేక వర్గీయులు గత మూడు సంవత్సరాలుగా పావులు కదిపారు. దీంతో ఆయనకు మంత్రి పదవి తప్పించారు. అయినా వర్గపోరు తగ్గలేదు. దీనిపై అధిష్ఠానానికి ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులు పలుసార్లు ఫిర్యాదు చేశారు. ఆఖరికి శంకర్‌నారాయణను అనంతపురం ఎంపీ అభ్యర్థిగా పంపుతూ పెనుకొండకు కళ్యాణదుర్గం ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి అయిన ఉషశ్రీ చరణ్‌ను పంపారు. రెండు రోజుల క్రితం మంత్రి భర్త శంకర్‌నారాయణవద్దకు వెళ్లగా తీవ్రంగా మందలించినట్లు సమాచారం. నేను ఆఖరి వరకు పెనుకొండ ఎమ్మెల్యే టికెట్‌కు పోరాడతానని నన్ను అడగకుండా నా వద్దకు ఎలా వచ్చారంటూ ప్రశ్నించినట్లు తెలిసింది. అయితే ఎమ్మెల్యే వర్గీయులు శంకర్‌నారాయణ ఇక్కడే ఉండాలని నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి ఉషశ్రీ చరణ్ పెనుకొండకు రాగా ఎమ్మెల్యే వర్గీయులు ఎవరూ స్వాగతం పలకడానికి, కలవడానికి వెళ్లలేదని సమాచారం. మొదటి రోజు ఆమె వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులే అధికంగా పాల్గొన్నట్లు అందులో కూడా ఓ సామాజిక వర్గం నేతలే ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో అక్కడ మొన్నటి వరకు అసమ్మతి వర్గీయులుగా ఉన్నవారు ప్రస్తుతం ఉషశ్రీకి మద్దతు పలుకుతుండగా నిన్నటి వరకు ఎమ్మెల్యేకు అనుకూలంగా ఉన్న వారంతా ఉషశ్రీ వ్యతిరేక వర్గంలో చేరారు.

పురంలో సొంత సామాజికవర్గం నేతలు ఎక్కడ ?

ఇదిలా ఉంటే హిందూపురం పార్లమెంట్ వైసీపీ ఇన్‌చార్జ్‌గా నియమితులైన జే.శాంత శనివారం మొదటిసారిగా హిందూపురానికి విచ్చేశారు. అయితే మూడు రోజులుగా ఆమె రాకపై తీవ్ర చర్చ జరిగింది. ఎట్టకేలకు ఆమె హిందూపురానికి రాగా కేవలం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త దీపిక వర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు మాత్రమే ఆమెకు స్వాగతం పలికి కలిసిన వారిలో ఉన్నారు. మరో రెండు వర్గాలకు సంబంధించిన నాయకులు, కార్యకర్తలు అటుగా వెళ్లలేదు. అంతేకాక శాంత సొంత సామాజిక వర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులుండగా అధిక శాతం మంది సొంత సామాజికవర్గం నేతలు ఆమెకు స్వాగతం పలకడానికి వెళ్లలేదు. ఆమెపై ఇటీవల సోషల్ మీడియాలో వచ్చిన పోస్టు కారణంగా మైనార్టీ నాయకులు కూడా కలవడానికి వెళ్లలేదని సమాచారం. కర్ణాటకలో బీజేపీలో ఉంటూ ఇక్కడ వైసీపీ తరుపున పోటీలో ఉండటంపై ఆ సామాజికవర్గం నేతలు ఆమె వద్దకు వెళ్లడానికి సైతం ఇష్టపడటం లేదని తెలుస్తోంది.దీంతో సమన్వయకర్త వర్గీయులు కొంతమంది మాత్రం ఆమెను స్వాగతించినట్లు తెలిసింది. మరో రెండు వర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆమె రాక సందర్భంగా ఎంతమంది వచ్చారన్నదానిపై చర్చ ప్రారంభించారు. ఏది ఏమైనా ఇన్‌చార్జ్‌లను మార్చినా ఆ పార్టీకి చేకూరే ప్రయోజనం శూన్యమని సొంత పార్టీ నాయకులే విమర్శిస్తున్నారు.

అర్హులు ఆర్థిక అభివృద్ధి చెందటమే

వికసిత్ భారత్ ఉద్దేశం

గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్


మాట్లాడుతున్న గవర్నర్

బుక్కరాయసముద్రం, జనవరి 6: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆర్థిక ప్రయోజనం చేకూర్చడమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర ప్రధాన ఉద్దేశమని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బుక్కరాయసముద్రంలోని జిల్లా పరిషత్ మైదానంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. ఆయనకు కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్ స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో గవర్నర్ మా ట్లాడుతూ పథకం ఏదైనా అధికారులు సమన్వయంతో పనిచేసి అర్హులకు లబ్ధిచేకూరేలా కృష చేయాలన్నారు. ప్రధానంగా మహిళలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. గడచిన ఐదు సంవత్సరాల్లో దేశంలో 13 కోట్ల మంది ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. సంక్షేమం, ఆర్థిక ప్రయోజనాలను పెంపొందించడం కోసమే ఆయుష్మాన్ భారత్ యోజ న, పీఎం ఆవాస్‌యోజన, పీఎం పోషణ్ అభియాన్ తదితర పథకాలు ఉన్నాయన్నారు. ప్రపంచంలోనే భారతదేశం ఆర్థిక రంగంలో ఐదోస్థానంలో ఉందన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం ద్వారా అభివృద్ధి మరింత సాధ్యమన్నారు. అదేవిధంగా కేంద్రీయ విశ్వవిద్యాలయం ద్వారా విద్యాభివృద్ధి ఉంటుందన్నారు. ఉపాధి అవకాశాలూ పెరుగుతాయన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రదర్శన

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన ప్రదర్శనను గవర్నర్ సందర్శించారు. ఒక్కొక్క పథకం గురించి గవర్నర్ అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఈ పథకాల వల్ల ఎంత అభివృద్ధి జరిగింది..? తదితర విషయాలను తెలుసుకున్నారు.

మొబైల్ ఐఈసీ వాహనం ప్రారంభం

వికసిత్ భారత్ సంకల్పయాత్ర మొబైల్ ఐఈసీ వాహనాన్ని జెండా ఊపి గవర్నర్ ప్రారంభించారు. ఈ మొబైల్ వాహనం ద్వారా ప్రతి గ్రామంలో వివిధ పథకాల కింద అర్హులైన, ఇప్పటి వరకు ప్రయోజనాలు పొందని వారికి లబ్ధిచేకూరనుంది. అనంతరం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి ఎల్ఈడీ స్క్రీన్‌పై లఘుచిత్రాలను ప్రదర్శించారు.

ప్రసంగించిన డ్వాక్రా మహిళలు

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలపై డ్వాక్రా మహిళలు లింగమ్మ, నాగజ్యోతి, భవానీ మాట్లాడారు. వారి అభివృద్ధికి ఏవిధంగా దోహదపడ్డాయో వివరించారు. వీరిని గవర్నర్ సన్మానించారు. తక్కువ పొలంలో ఎక్కువ ఆదాయం సాధించిన బుక్కరాయసముద్రం రైతు జనార్దన్‌రెడ్డి, జూడోలో ప్రతిభచూపుతున్న 8వ తరగతి విద్యార్థి సాకేదర్శన్‌లను సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే జొన్నలగడ్డపద్మావతి, అధికారులు పాల్గొన్నారు.

వైసీపీలో తిరుగుబాటు మొదలైంది

● కేతిరెడ్డిని ఓడించడమే లక్ష్యంగా పని చేస్తాం

● విలేకరుల సమావేశంలో చిలకం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చిలకం మధు

ధర్మవరం, జనవరి 6: వైసీపీలో తిరుగుబాటు మొదలైందని, ఇక జగన్ పని అయిపోయినట్టేనని, స్థానికంగా కేతిరెడ్డిని ఓడించడమే తమ లక్ష్యమని జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తన స్వగృహంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ పని అయిపోయిందన్నారు. జగన్‌తోపాటు మంత్రులు, ఎమ్మెల్యేల పని కూడా అయిపోయినట్టేనని అన్నారు. వైసీపీలో చాలామంది నాయకులు సొంతపార్టీపైనే తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. ధర్మవరం నియోజకవర్గంలో ప్రతిపక్షాలనన్నింటినీ ఏకతాటిపైకి తెచ్చి కేతిరెడ్డిని ఇంటికి పంపడమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికలలో టికెట్ల కేటాయింపు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ డిసైడ్ చేసుకుని త్వరలో ప్రకటిస్తారని ఆయన పేర్కొన్నారు.

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి



సమావేశంలో మాట్లాడుతున్న సామకోటి ఆదినారాయణ

బుక్కపట్నం, జనవరి 6: బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. మండలకేంద్రంలో శనివారం బీసీల సమావేశం జరిగింది. ఇందులో సామకోటి పాల్గొని మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమవుతుందన్నారు. బీసీలను రాజకీయంగా పైకి తెచ్చింది తెలుగుదేశమేనన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే బీసీల రక్షణకోసం ఎస్సీఎస్టీ తరహాలో ప్రత్యేక చట్టం తీసుకురానున్నట్లు చెప్పారు. అందుకు అనుగుణంగా మాజీ సీఎం చంద్రబాబు , యువనాయకుడు లోకేష్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో నాయకులు రంగప్ప, కేశప్ప, ఈశ్వరయ్య, మంజునాథ్, ఆంజనేయులు, వీరనారప్ప, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ర్యాలీతో సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

పుట్టపర్తి, జనవరి 6: పట్టణంలో సమగ్రశిక్ష ఉద్యోగులు బైక్ ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం వారు చేపట్టిన సమ్మె శనివారం నాటికి 18వ రోజుకు చేరింది. సందర్భంగా స్థానిక ఆర్డీవో కార్యాలయం నుంచి గణేష్ సర్కిల్‌వరకు బైక్‌ర్యాలీ చేశారు. అనంతరం గణేష్ సర్కిల్ చుట్టూ తిరిగారు. సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఫెడరేషన్ జేఏసీ అధ్యక్షుడు ఓబుళరెడ్డి మాట్లాడుతూ సమగ్రశిక్ష ఉద్యోగులు 20 ఏళ్ల నుంచి పని చేస్తున్నా ఉద్యోగభద్రత లేదన్నారు. విద్యాశాఖలో అన్నివిభాగాల్లో పనిచేస్తున్న తమకు ఉద్యోగభద్రతో పాటు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. మెడికల్ సెలవులు, ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లాకార్యదర్శి వెంకటేష్, ఉద్యోగ సంఘం నాయకులు రామన్న, రవి. నాగరాజు, ఓబులేసు, భవాని, స్రవంతి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో మున్సిపల్ కార్మికులు

● ఆగిన తాగునీటి సరఫరా



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకున్న మహిళలు

పుట్టపర్తి, జనవరి 6: మున్సిపల్ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం 12రోజులుగా సమ్మె కొనసాగిస్తున్నారు. దీంతో చెత్త తొలగింపుతోపాటు పట్టణానికి నీటి సరఫరా కూడా నిలిపివేశారు. మోటార్లు ఆడకుండా సిబ్బంది ఫీజులు తొలగించారు. దీంతో నాటి ఇబ్బంది తలెత్తడంతో శనివారం కౌన్సిలర్ లక్ష్మీపతి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. చిత్రావతి రోడ్డు, గుట్ట ప్రాంతంలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. కనీసం నీటిని కూడా సరఫరా చేయకపోవడం సరి కాదని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించి, పారిశుద్యానికి, తాగునీటి సరఫరాకు కృషి చేయాలని కోరుతున్నారు.

మృతుడి కుటుంబానికి పల్లె పరామర్శ

బుక్కపట్నం, జనవరి 6: మండలంలోని కొత్తకోట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చిల్లా చినప్పకుమారుడు కేశవ ఆకస్మికంగా శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆ గ్రామానికెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తనవంతుగా ఆర్థికసాయం అందించారు. పల్లె వెంట సీనియర్ నాయకులు గోపాలపురం గంగాధర్ తదితరులు ఉన్నారు.

టీడీపీ నాయకుడిని పరామర్శించిన సామకోటి

ఓబుళదేవరచెరువు: అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ సీనియర్ నాయకుడు నిజాంను ఆపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పరామర్శించారు. పుట్టపర్తి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిజాంను సామకోటి పరామర్శించి ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతుల ప్రదానం

అమడగూరు, జనవరి 6: మండలంలోని మహమ్మదాబాద్ వి.మస్తాన్‌రెడ్డి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో క్రీడల్లో, చదువులో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను శనివారం ప్రదానం చేశారు. గత విద్యాసంవత్సరంలో 3 నుంచి 10వ తరగతి వరకు వివిధ సబ్జెక్టుల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు, క్రీడపోటీల్లో ప్రతిభ కనబరచిన వారికి కలిపి సుమారు 162మందికి నగదు బహుమతులు పి. మస్తాన్‌రెడ్డి మెమోరియల్ ట్రస్టు సభ్యులు విశ్వనాథ్‌రెడ్డి, నాగార్జునరెడ్డి అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనాథ్, ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రతి ఏడాదీ జాబ్‌క్యాలెండర్ ఏదీ? : తెలుగు యువత

కదిరి, జనవరి 6: నిరుద్యోగులకు ప్రతి సంవత్సరం జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చి జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చారని, అయితే ఐదేళ్లు గడుస్తున్నా జాబ్‌క్యాలెండక్ ఎక్కడని తెలుగుయువత నాయకులు ప్రశ్నించారు. పట్టణంలో శనివారం కదిరిలో వారు విలేకరులతో మాట్లాడారు. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తి అవుతున్నా.. ఇంతవరకు ఒక జాబ్ క్యాలెండర్ కూడా విడుదల చేయలేదన్నారు. ప్రతి సంవత్సరం జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. సమావేశంలో రాష్ట్ర తెలుగుయువత నాయకులు సాలక్కి హనుమంతరావు, రాష్ట్రయువత కార్యదర్శి కుందిలి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు జి. చైతన్య, ఎస్‌పీ చౌదరి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడిన గదుల పరిశీలన

ఆంధ్రజ్యోతి స్పందన



జంబులవాండ్లపల్లి పాఠశాలలో పెచ్చులూడిన గదిని పరిశీలిస్తున్న ఎంఈఓ

ఓబుళదేవరచెరువు, జనవరి 6: మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదుల పైకప్పు పెచ్చులూడి కింద పడుతుండడంతో విద్యార్థులు భయాందోళనల నడుమ విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. దీనిపై శుక్రవారం ఆంధ్రజ్యోతి దిన ప్రతిక ప్రభుత్వ పాఠశాలలో భయం భయం అన్న శీర్షికన కథనం ప్రచురించింది. ఇందుకు స్పందించిన ఎంఈఓ రమణ శనివారం మండలంలోని జంబులవాండ్లపల్లి, వీర ఓబునపల్లి తదితర పాఠశాలలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పెచ్చులుండిన పాఠశాలల గదులు పరిశీలించామని, వాటికి సంబంధించిన నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామని అన్నారు.

ధర్మవరంలో రౌడీయిజం లేకుండా చేస్తా

● ఎమ్మెల్యే కేతిరెడ్డి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు

● పాదయాత్రలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్



పట్టణంలో పాదయాత్ర చేస్తున్న పరిటాలశ్రీరామ్, నాయకులు



శ్రీరామ్ సమక్షంలో టీడీపీలోకి చేరిన యువకులు

ధర్మవరం, జనవరి 6: టీడీపీ అధికారంలోకి రాగానే ధర్మవరం నియోజకవర్గంలో రౌడీయిజం లేకుండా చేయడానికి కృషి చేస్తానని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ అన్నారు. ప్రజాచైతన్య పాదయాత్రలో భాగంగా శనివారం మూడో రోజు ఆయన పట్టణంలోని పలు కాలనీల్లో పర్యటించారు. 32వ వార్డు పరిధిలోని సత్యసాయినగర్‌లో ఉన్న అన్నపూర్ణేశ్వరి ఆలయం నుంచి ప్రారంభమైన పాదయాత్ర గిర్రాజుకాలనీ, దుర్గానగర్, సుందరయ్యనగర్, ప్రియాంకనగర్, లక్ష్మీచెన్నకేశవపురం మీదుగా ఇందిరమ్మకాలనీ వరకు సాగింది. ఇందులో ప్రజలు అనేక సమస్యల్ని శ్రీరామ్ దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా పింఛన్‌లు, రేషన్‌కార్డులు అందలేదని , డ్రైనేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. మరో వైపు స్వయం సహాయక సంఘాల ప్రతినిధులకు సంబంధించిన దాదాపు నాలుగు కోట్ల రూపాయలను పక్కదారి పట్టించినట్టు కొందరు ఆయన దృష్టికి తెచ్చారు. దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు శ్రీరామ్ స్పందిస్తూ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేకంగా కమిషన్ వేసి విచారణ చేయిస్తానని హామీ ఇచ్చారు. టైలరింగ్ వృత్తిపై ఆధారపడి పట్టణంలో దాదాపు 2వేల మంది మహిళలు జీవిస్తున్నారని, ఇటీవల రెడీమేడ్ షోరూంలు పెరిగిపోవడం వల్ల తమకు ఉపాధిలేకుండా పోయిందని దుర్గానగర్‌కు చెందిన మహిళలు వాపోయారు. తమకు గార్మెంట్స్ పరిశ్రమలు లాంటివి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అధికారంలోకి రాగానే గార్మెంట్స్ పరిశ్రమ స్థాపన కోసం కృషిచేస్తానని శ్రీరామ్ తెలిపారు. అనంతరం ఆయన స్థానిక పరిస్థితులపై మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కేతిరెడ్డి గుడ్‌మార్నింగ్ ద్వారా ఏం సమస్యలు పరిష్కరించారని ప్రశ్నించారు. పైగా నేను పాదయాత్ర చేస్తుంటే నా వద్దకు రాకుండా ప్రజల్ని బెదిరింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. శ్రీరామ్ వద్దకు వెళ్తే మీకు సంక్షేమపథకాలు అందవని వైసీపీ నాయకులు బెదిరిస్తున్నారన్నారు. మరోవైపు తాను ముందు వెళ్తుంటే వెనుక వైపు నుంచి కొందరు శ్రీరామ్‌కు ఓటు వేయకపోతే చంపేస్తామని, మాది వెంకటాపురం అంటూ కుట్రపూరిత చర్యలకు పాల్పడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. గతంలో పరిటాల రవీంద్రపై కూడా ఇలాంటి కుట్రలే చేశారన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. వైసీపీవారి బెదిరింపులు, దౌర్జన్యాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ధర్మవరంలో రౌడీయిజం లేకుండా చేస్తానని అన్నారు. ప్రజలు ఎవరినో చూసి భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రతిఒక్కరికీ టీడీపీ అండగా ఉంటుందన్నారు. ధైర్యంగా వచ్చి సమస్యలను తెలియజేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలు

నియోజకవర్గంలో వైసీపీకి దెబ్బమీద దెబ్బపడుతోంది. పరిటాలశ్రీరామ్ పాదయాత్ర సందర్భంగా యువకులు పెద్ద ఎత్తున తెలుగుదేశంలోకి చేరుతున్నారు. తాజాగా 32వవార్డుకు చెందిన సాదిక్, రిజ్వాన్‌ఖాన్, షామీర్‌తో పాటు 40 కుటుంబాల మైనారిటీలు పరిటాలశ్రీరామ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి శ్రీరామ్ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ గెలుపుకోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలని పరిటాలశ్రీరామ్ వారికి సూచించారు.

కార్మికుల సమస్యల్ని వెంటనే పరిష్కరించాలి

● ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు



పుట్టపర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పుట్టపర్తి, జనవరి 6: మున్సిపల్ కార్మికుల సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి 12వ రోజుకు చేరింది. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద వారు నిరసన కొనసాగించారు. వారికి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మద్దతు తెలిపి మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. 12రోజులుగా సమ్మె చేసున్నా సీఎంకు కనీసం చీమకుట్టినట్లు కూడా లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా స్పందించాలని కోరారు. పట్టణంలో పారిశుధ్య పనులు చేయకుండా కార్మికులు అడ్డుకున్నారు. తమ సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు లక్ష్మీనారాయణ, గంగాద్రి, ఏఐటీయూసీ నాయకుడు గౌస్‌లాజం, కార్మిక నాయకులు రామయ్య, పెద్దన్న, నరసింహులు, నాగార్జున పాల్గొన్నారు.

ధర్మవరం: మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్,పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్, రిస్క్ అలవెన్సులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికసంఘం గౌరవసలహాదారులు పెద్దక్క, వెంకటేశులు, సెక్రెటరీ చెన్నకేశవులు, కోశాధికారి లక్ష్మీ ఓబులేశు, ఉపాధ్యక్షుడు ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ ముకుంద, ఔట్‌సోర్సింగ్‌ఇంజనీరింగ్ విభాగపుఉద్యోగ కార్మికసంఘంఅధ్యక్షుడు అద్రామహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి: సమస్యల పరిష్కారం కోరుతూ పట్టణంలోని మున్సిపల్ కార్మికులు ర్యాలీ చేపట్టారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ టవర్‌క్లాక్, వేమారెడ్డి సర్కిల్, అంబేద్కర్ సర్కిల్ మీదుగా సాగింది. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వల్లం రాజేంద్రప్రసాద్ మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్సు యూనియన్ నాయకులు నాగరాజు, సూరి, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక నాయకులు శ్రీనివాసులు, రాజా, గంగాద్రి, కృష్ణప్రసాద్, గంగాదేవి, శివమ్మ, మహేశ్వరీ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.



ధర్మవరంలో మున్సిపల్ కార్యాలయం ముట్టడి



కదిరిలో ర్యాలీ..

మాట తప్పిన సీఎం జగన్

● ఆగ్రహించిన అంగన్‌వాడీలు ● 26వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె



ధర్మవరంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఖోఖో ఆడుతూ నిరసన

ధర్మవరం, జనవరి 6: అంగన్‌వాడీలను అక్కచెల్లమ్మలు అంటూ హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మాట తప్పారని అంగన్‌వాడీలు ఆగ్రహించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి 26వ రోజుకు చేరింది. దీక్షా శిబిరం వద్ద అంగన్‌వాడీలు ఖోఖో ఆడుతూ వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తమకు సీఎం జగన్ ఎన్నో హామీలిచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కారన్నారు. 26 రోజులుగా నిరసనలు చేస్తున్నా స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లిపెద్దన్న, సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎల్ ఆదినారాయణ వారికి మద్దతు తెలిపారు.

నంబులపూలకుంట: మండలకేంద్రంలో అంగన్‌వాడీలు చేతులెత్తి దండంపెడుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో కార్యకర్తలు, ఆయాలు ఉన్నారు.

ముదిగుబ్బ: మండలకేంద్రంలో అంగన్‌వాడీలు సమ్మెను కొనసాగించారు. వారికి సీపీఐ మండల కార్యదర్శి చల్లాశ్రీనివాసులు మద్దతు తెలిపి మాట్లాడారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని, గ్రాట్యూటీ రూ.5లక్షలు అమలు పరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాసినేపల్లిలో భవిష్యత్తుకు గ్యారెంటీ



రాసినేపల్లిలో మినీమేనిఫెస్టోపై ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు



నల్లమాడ బీసీకాలనీలో కరపత్రాలు అందజేస్తున్న తెలుగుదేశం శ్రేణులు

తనకల్లు, జనవరి 6: మండలంలోని రాసినేపల్లి పంచాయతీలో శనివారం టీడీపీ, జనసేన నాయకులు బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రజలకు కరపత్రాలు పంచుతూ చంద్రబాబు ప్రకటించిన మినీమేనిఫెస్టో పథకాలపై వివరించారు. తెలుగుదేశం అధికారం చేపట్టిన వెంటనే అన్ని పథకాలను అమలు చేస్తారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తొట్లిరెడ్డిశేఖర్‌రెడ్డి, జనసేన కన్వీనర్ కేవీరమణ, ఎంపీటీసీ అమరకార్తికేయ, నాయకులు గంగప్పనాయుడు, రమణప్పనాయుడు, అక్కులప్పనాయుడు, జయచంద్రనాయుడు, రెడ్డెప్పనాయుడు కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లమాడ: మండలకేంద్రంలోని బీసీ కాలనీలో టీడీపీ శ్రేణులు బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య ముఖ్యఅతిథిగా హాజరై వారితో పాటు ఇంటింటికీ తిరిగి మినీ మేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే కరపత్రాలు పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా పనిచేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శివశంకర్, నాయకులు బుట్ట నాగభూషణంనాయుడు, మణికుమారి, మైలే రామచంద్ర, మంజునాథ్‌రెడ్డి, ఈశ్వరయ్య, శ్రీనివాసరెడ్డి, కిరణ్, అగ్గిరాముడు, రాము, తదితరులు పాల్గొన్నారు.

సాధన చేస్తే సాధ్యం కానిది ఏదీ లేదు

● సత్యసాయి సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమిష్ పాండె



బాలవికాస్ గురువులను సన్మానిస్తున్న ట్రస్టు సభ్యులు

పుట్టపర్తి, జనవరి 6: సాధన చేస్తే సాధ్యం కానిది ఏదీ లేదని సత్యసాయి సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండె పేర్కొన్నారు. పట్టణంలోని సాయికుల్వంత్ మందిరంలో శనివారం సాయంత్రం బాలవికాస్ విద్యాసంస్థల అల్యూమినియం వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదట విద్యార్థులు వేదపఠనం తో వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిమిష్‌పాండె ప్రసంగిస్తూ జీవితంలో ఏదైనా సాధించాలంటే సాధన చాలా ముఖ్యమన్నారు. సత్యసాయి బాబా ఆధ్యాత్మికత, వ్యక్తిత్వ వికాసం, ప్రేమ, సేవలను తెలియజేసేందుకు నాడు బాలవికాస్ విద్యా వ్యవస్థలను తెచ్చారన్నారు. నాటినుంచి నేటి వరకు బాలవికాస్ విద్యను దేశ వ్యాప్తంగా బాలబాలికలకు అందిస్తున్నామన్నారు. వేలాదిమంది గురువులు పాల్గొని బాలబాలికలకు దైవతత్వం, ఆధ్యాత్మికత, సేవతత్వాన్ని బోధిస్తున్నారని, తద్వారా వేలమంది విద్యార్థులు సామాజిక సేవా దృక్పథంతో సత్యసాయి చూపించిన సేవాస్ఫూర్తితో సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం బాలవికాస్ గురువులను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, సద్గురు చక్రవర్తి సన్మానించారు. బాలవికాస్ విద్యార్థులు సత్యసాయి ప్రేమతత్వంపై సంగీత నృత్యరూపక నాటిక, నృత్యాలు ప్రదర్శించి అలరించారు.



నృత్యం చేస్తున్న బాలవికాస్ విద్యార్థులు

ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలు

బత్తలపల్లి, జనవరి 6: మండలకేంద్రంలో శనివారం వీహెచ్‌పీ కార్యకర్తలు ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ అయోధ్యలో శ్రీరాముడి నూతన ఆలయం నిర్మించారని, ఈ నెల 22వ తేదీన శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ జరగనుందని, ఆ రోజున ప్రతి ఇంటిలో ప్రజలు ఐదు దీపాలు వెలిగించి శ్రీరాముడిని స్మరించుకోవాలని సూచించారు. అలాగే అయోధ్య రామాలయ ట్రస్టువారు పంపిన ఈ అక్షింతలను పూజగదిలో ఉంచుకుని శుభకార్యాలలో వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యోగానందచారి, గోపాల్, రామంజనేయలు, గంగాధర్, మధుసూదన్, శేఖర్, నారాయణస్వామి మాధవి,నాగరాజు,పెద్దన్న పాల్గొన్నారు.

చిన్నారులకు సకాలంలో టీకాలు వేయాలి

బత్తలపల్లి, జనవరి 6: చిన్నారులకు వేయాల్సిన అన్ని రకాల టీకాలను సకాలంలో వేయాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ కృష్ణయ్య తెలిపారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, టీకాల నిల్వను పరిశీలించారు. తర్వాత సిబ్బందితో మాట్లాడుతూ చిన్నారులకు టీకాలు వేయడంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. సకాలంలో టీకాలు వేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రామకృష్ణ ,సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

కొత్తచెరువు, జనవరి 6: కిద్మత్ ఏ ఖల్క్ చారిటబుల్‌ట్రస్టు వారు శనివారం మండలకేంద్రంలోని సుమారు 80 మంది నిరుపేద కుటుంబాలకు దుస్తులను పంపిణీ చేశారు. తొలుత నాగిరెడ్డిపల్లికి వెళ్లే రోడ్డు సమీపంలో గుడిసెలు వేసుకుని నివాసముంటున్న 50 పేద కుటుంబాలకు, తర్వాత ప్రభుత్వాస్పత్రి వెనుక ఉన్న 30 కుటుంబాల వారికి దుస్తులను పంపిణీ చేశారు. ఆ గుడిసెల్లోని వారు చలికాలంలో దుస్తులు లేక ఇబ్బందులు పడుతున్న సంగతిని తెలుసుకుని.. ట్రస్టు ఆధ్వర్యంలో పంపిణీ చేశామని సభ్యులు షాకీర్,రాజు, సాయిమాతాంగి, శ్రావణ్, సొహెల్, సలీం తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్ ఫైనల్ కీ విడుదల

కొత్తచెరువు, జనవరి 6: రాష్ట్రవ్యాప్తంగా జరిగిన జాతీయ ఉపకార వేతన పరీక్ష 3-12-2023న జరిగింది. ఆ పరీక్షకు సంబంధించిన ఫైనల్ కీని ప్రభుత్వం శనివారం విడుదల చేసిందని డీఈఓ మీనాక్షి ఒక ప్రకటనలో తెలిపారు. www. dse.ap.govలో ఫైనల్ కీని చూడవచ్చన్నారు. ఫైనల్ కీలో ఎటువంటి అభ్యంతరాలు స్వీకరించబడవని ప్రభుత్వ పరీక్షల సంచాలకులు తెలియజేశారని ఆమె తెలిపారు.

మా సమస్యలను పరిష్కరించండి

ధర్మవరం, జనవరి 6: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక తమ సమస్యలు పరిష్కారానికి కృషిచేయాలని తోలుబొమ్మల సామాజిక వర్గానికి చెందిన పలువురు పరిటాలశ్రీరామ్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోనిశ్రీలక్ష్మీచెన్నకేశవపురంలో శనివారం సాయంత్రం నిర్వహించిన ప్రజాచైతన్యపాదయాత్రలో 25వ వార్డుకు చెందిన తోలుబొమ్మలసామాజిక వర్గానికి చెందినపలువురు శ్రీరామ్‌ను కలిశారు. తాము కచేరి చేయడానికి, తోలుబొమ్మలు తయారుచేయడానికి, కమ్యూనిటీ హాల్, షెడ్ నిర్మాణానికి 45సెంట్ల స్థలం కేటాయించేలా చూడాలని విన్నవించారు. అదేవిధంగా 45సంవత్సరాలు నిండిన తోలుబొమ్మలాట కార్మికులకు పింఛన్ మంజూరు చేయించాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వానికి ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో 25వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాసుడి కళ్యాణం

పుట్టపర్తి, జనవరి 6: శ్రీనివాస కల్యాణ్యాన్ని ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. శనివారం జిల్లా కేంద్రంలోని వాసవీ సత్రంలో మొదట కల్యాణమండపాన్ని ప్రారంభించారు. అనంతరం శ్రీనివాస కల్యాణోత్సవాన్ని, సత్యనారాయణ వ్రతాన్ని వేదపండితులు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీనివాసుడి కళ్యాణోత్సవం చేశారు. అనంతరం సత్యనారాయణ స్వామి వ్రతాలు, హోమాలు నిర్వహించారు. భక్తులందరికీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ సత్ర సముదాయం జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షులు సిద్దా నాగేశ్వరరావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

నల్లమాడ, జనవరి 6: మండలంలోని రెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 10వతరగతి విద్యార్థులకు కదిరి యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ శనివారం అందించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కనుముక్కల లక్ష్మణ మాట్లాడుతూ విద్యార్థులకు ఈ విలువైన మెటీరియల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు దీనిని వినియోగించుకుని పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల గౌరవాధ్యక్షుడు ఆయూబ్ బాషా, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, సోమశేఖర్, ఫైరోజ్ బాషా, ప్రతాప్, సుధాకర్, వాసిన్, పోతలయ్య, చంద్రనాయక్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీ ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులు

గోరంట్ల, జనవరి 6: పట్టణంలోని చౌడేశ్వరీ దేవి ఆలయం 14వ వార్షికోత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు నాగభూషణ స్వామి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. మహామంగళహారతి అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. స్థానిక భక్తులతో పాటు కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

ఏకశిలా విగ్రహం పనులు ప్రారంభం



హనుమాన్ చాలీసా పఠిస్తున్న భక్తులు

హిందూపురం అర్బన్, జనవరి 6: పట్టణంలోని ప్రసిద్ధ సూగూరు ఆంజనేయస్వామి దేవాలయం వద్ద భారీ ఏకశిల ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. ఇందు కోసం కర్ణాటక నుంచి ఏకశిలను పురానికి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఆ విగ్రహాన్ని మలచడానికి పనులు ప్రారంభించనున్న సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయంలో వందలాది మంది భక్తులు శనివారం హనుమాన్ చాలీసా పఠించారు. భజనలు, కీర్తనలు చేపట్టారు. ఏకశిలా విగ్రహ నిర్మాణ పనులపై చర్చ జరిపారు. కార్యక్రమంలో ఏకశిల దాత వైసీ చంద్ర, రాయల్‌గోపాల్, రమేష్‌రెడ్డి, పార్థసారథి, ఆదర్శ వైటీపీ శీన, నటరాజ్, వెంకటేష్, కార్తీక్, కిషోర్, సూరి, రామకృష్ణ, భారతి, బాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలి

ప్రగతిశీల విద్యార్థి సంఘం నాయకులు

గోరంట్ల, జనవరి 6: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానాన్ని వెంటనే రద్దు చేయాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం నాయకులు శనివారం డిమాండ్ చేశారు. యునైటెడ్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా పేరుతో 15 విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 12న ఢిల్లీలో నిర్వహించే పార్లమెంటు మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను వారు విడుదల చేశారు. విద్యారంగాన్ని కాపాడుకోవడానికి చేపట్టే ఆందోళనలో విద్యార్థులు పాల్గొన్నాలని కోరారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశ సంపదలను అమ్మేస్తూ, ఉద్యోగావకాశాలు లేకుండా చేసినందుకు యువత వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌యూ నాయకులు శివకుమార్, ప్రశాంత్, రవి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రజల్లో పోలీస్ వ్యవస్థపై నమ్మకం పెంచండి : ఎస్పీ

లేపాక్షి, జనవరి 6 : ప్రజల్లో పోలీస్ వ్యవస్థపై నమ్మకం పెంచాలని సత్యసాయిజిల్లా ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీకి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో నిఘా పెంచాలని, అక్రమ మద్యం నిర్వహిస్తున్న వ్యాపారులపై కఠినంగా వ్యవహరించాలన్నారు. కేసుల పరిష్కారానికి చొరవ చూపాలని, పోలీసుల తీరుమారాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, దొంగతనాల కట్టడిపై నిఘా పెంచాలన్నారు. సాయంత్రం వేళలో రోడ్డుపై విజబుల్ పోలీస్, రాత్రివేళల్లో గస్తీ ముమ్మరం చేయాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ కంజక్షన్, సీఐ వేణుగోపాల్, ఎస్ఐ గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యం

బాలల హక్కుల కమిషనర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్

మడకశిరటౌన్, జనవరి 6: బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యంగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల కమిషనర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం 'బాల్యవివాహాల నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణ' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ... రాష్ట్రంలో మారుమూల ప్రాంతమైన మడకశిరలోనే బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. మహిళలు అధికారులు, పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు అందరూ కలిసి బాల్య వివాహాలపై పిల్లల్లో అవగాహన తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ నాగమల్లేశ్వరి, తహసీల్దార్ హసీనా సుల్తానా, ఎంఈఓ-2 నరసింహమూర్తి, ఎస్ఐ లోకేష్ జిల్లా బాలల హక్కుల పరిరక్షణ అధికారి మహేష్, అధికారులు నాగలక్ష్మి, మురళీధర్, ఆర్డీటీ ప్రతినిధులు మల్లికార్జున, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌లో ఇంటిపన్ను కోతా..?

జడ్పీటీసీ ఉమేష్

అగళి, జనవరి 6: వృద్ధులు, వితంతువులు, వికలాంగుల పించన్లలో ఇంటి పన్ను కట్‌చేస్తున్నారని జడ్పీటీసీ ఉమేష్ అన్నారు. మండలకేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్ పంపిణీ, బియ్యం పంపిణీ అని చెప్పుకుంటున్న ప్రభుత్వం ఎనిమిదో తేదీ అయినా పింఛన్, బియ్యం పంపిణీ చేయలేదని వాపోయారు. ఇలాంటి పాలకులు ప్రజలకు ఇంకా ఎన్నోసహాయ సహకారాలు అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. అయితే టీడీపీ మేనిఫెస్టో ప్రకారం ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే బాబు ష్యూరిటీ గ్యారెంటీ పథకాలను ప్రజలకు ఇబ్బంది కలగకుండా సక్రమంగా అందించేందు కు చర్యలు తీసుకుంటుందన్నారు. వైసీపీ పాలనలో ఒక్క ప్రాజెక్ట్‌కానీ అభివృద్ధి పనికానీ జరగలేదన్నారు. గొప్పలు చెప్పుకుంటున్నారేకానీ చేసిందేమీలేదన్నారు. ఏది ఏమైనా వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం, రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారాచంద్రబాబు నాయుడు బాధ్యతలు తీసుకో కావడం తథ్యమని ఆయన పేర్కొన్నారు.

కొడికొండ చెక్‌పోస్టులో రూ.10 లక్షల నగదు పట్టివేత

చిలమత్తూరు, జనవరి 6: ఎటువంటి రసీదులు, లెక్కలు లేని రూ. 10 లక్షల నగదును కొడికొండ చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.ఐ గంగాధర్ తెలిపారు. చిలమత్తూరు మండలం కొడికొండ ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులో శనివారం మధ్యాహ్నం కర్ణాటక రాష్ట్రం చిక్కబళాపురానికి చెందిన మహమ్మద్ అలీ (40) అనే ఒక వ్యక్తి తన స్కూటీ వాహనంలో బాగేపల్లి వైపు నుంచి అనంతపురం వైపు వెళుతున్నాడు. ఈ సమయంలో చెక్‌పోస్టులో వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు స్కూటీని ఆపి తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో స్కూటీ డిక్కీలో పెద్ద మొత్తంలో నగదు బయటపడింది. ఈ నగదుకు సంబంధించి సరైన వివరాలు చెప్పాలని ప్రశ్నించగా అతడు ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. దీంతో ఆ నగదును స్వాధీనం చేసుకొని సెబ్, జీఎస్టీ అధికారుల సమక్షంలో లెక్కపెట్టగా రూ. 10 లక్షలు ఉన్నట్లు తేలింది. వెంటనే నగదుతో వెళుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదును సీజ్ చేసి ఆదాయ పన్నుల శాఖ అధికారులకు అప్పగించామన్నారు.



కన్సోలేషన్ బహుమతులు అందుకుంటున్న పోటీ దారులు





ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు, యువతులు



ముగ్గుల పోటీలకు తరలివచ్చిన జనం

హిందూపురం, జనవరి 6 : స్థానిక ఎంజీఎం క్రీడా మైదానంలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, ఎన్‌టీకే సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలకు జిల్లా నలుమూలల నుంచి ముగ్గులు వేయడానికి వాటిని తిలకించేందుకు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2.30వరకు ఎంజీఎం క్రీడా మైదానం జనంతో కిక్కిరిసింది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలక్రిష్ణ సతీమణి వసుంధరదేవి సహకారంతో ముగ్గుల్లో పాల్గొన్న మహిళతోపాటు కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో హిందూపురం ఆంధ్రజ్యోతి పీసీ ఇన్‌చార్జ్ బాలక్రిష్ణ, పాత్రికేయ సిబ్బంది రమేష్, రవీంద్రరెడ్డి, నాగభూషణ, ప్రసాద్, ఏబీఎన్ రిపోర్టర్లు శ్రీనివాసరెడ్డి, చంద్రమౌళి, ఏడీవీటీ రమేష్, ఇలియాజ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అదేవిదంగా టీడీపీ నాయకులు కొల్లకుంట అంజనప్ప, అమర్నాథ్, ఇందాద్, హిదాయత్, శ్రీదేవి, విజయలక్ష్మీ, వెంకటలక్ష్మీ, కౌన్సిలర్లు మంజుళ, భారతి, నవీన్, ఎస్టీసెల్ వెంకటరమణ, ఉమా శంకర్‌రెడ్డి, ఆంజనేయులు, హెచ్ఎన్ రాము, రవీంద్రనాయుడు, రవిచంద్ర, చంద్రమోహన్, అనంతపురం జగన్, తదితరులు పాల్గొన్నారు.





ముగ్గుల పోటీలకు హాజరైన వారితో కిక్కిరిసిన మైదానం

మా డిమాండ్లపై నిర్లక్ష్యం వహించిన సీఎం

ఆగ్రహం వ్యక్తం చేసిన అంగన్‌వాడీలు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

డిమాండ్ల సాధన కోసం 26 రోజులుగా సమ్మె చేస్తున్నా సీఎం జగన్ ఏమాత్రం పట్టించుకోకుండా గాలికి వదిలేశారని అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలో రోజుకొక విధంగా నిరసన తెలుపుతున్నారు. గోవిందా... గోవిందా... సీఎం గోవిందా అంటూ హిందూపురం, సోమందేపల్లిలో శనివారం పొర్లుదండాలతో నిరసన తెలిపారు. అగళిలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో హోమాలు చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం 26 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని, చిలమత్తూరులో గొర్రెకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించి నిరసన వ్యక్తం చేశారు. అలాగే గోరంట్ల, మడకశిర, గుడిబండ తదితర చోట్ల నిరసన దీక్షలు కొనసాగించారు. ఈ సమ్మెకు కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. గోరంట్లలో కొంతమంది కార్యకర్తలు ఉపవాస దీక్షతో ఆందోళనలో పాల్గొన్నగా, మిగిలినవారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మద్దతు పలికారు.



పురంలో పొర్లు దండాలు పెడుతున్న అంగన్‌వాడీలు



అగళిలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట హోమాలు



చిలమత్తూరులో గొర్రెకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

స్ట్రాంగ్ రూమ్‌ల కోసం పరిశీలన

లేపాక్షి, జనవరి 6 : ఈవీఎంలను భద్ర పరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌ల కోసం స్థానిక నాయనపల్లి క్రాస్‌వద్ద ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాల గదులను జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నూతనంగా జిల్లా ఏర్పడిన తరువాత మొదటి సారి జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఏర్పాటుకు స్ట్రాంగ్ రూమ్‌ల కోసం గదులను పరిశీలించామన్నారు. గురుకుల పాఠశాలలో డార్మెటరీ రూము, వివిధ తరగతి గదులతో పాటు ప్రిన్సిపాల్ గది, ల్యాబ్‌లను పరిశీలించామన్నారు. త్వరితగతిన సంబంధిత పనులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, తహసీల్దార్ బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పావగడలో పులి సంచారం.. భయాందోళనలో జనం

పావగడ, జనవరి 6: పావగడ పట్టణంలోని పావగడ సమీపంలో ఉన్న కడమలకుంట గ్రామ పొలాల్లో శుక్రవారం రాత్రి పెద్దపులి సంచరించడంతో ఆప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వారం రోజుల క్రితం మడకశిర ప్రాంతంలో మెళవాయి వద్ద రెండు పులి పిల్లలు చనిపోయినప్పటికీ ఒక ఆడ పెద్దపులి కొండలు గుట్టలు అధికంగా ఉన్న ప్రాంతంలో సంచరిస్తుండటం వల్ల పశువులు, మేకల కాపలాదారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. శుక్రవారం రాత్రి కడుమలకుంట గ్రామ సమీపంలోని పొలాల్లో గొర్రెలు, మేకలు ఉన్న ఆప్రాంతంలో పెద్దపులి సంచరిస్తుండటం ఒక్కసారిగా ఆప్రాంతం ప్రజలను భయంలో ముచ్చెత్తింది. అటవీ శాఖ అధికారులు ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

చిలమత్తూరు, జనవరి 6: అనంతపురం జిల్లా పర్యటనకు శనివారం వచ్చిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ ఘన స్వాగతం పలికారు. గవర్నర్ బెంగళూరుకు రోడ్డు మార్గాన వెళ్తూ కొడికొండ చెక్‌పోస్టులోని రక్షా అకాడమిలో కొంతసేపు విశ్రాంతి తీసుకు న్నారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా అధికారులు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు.

రైతులకు అన్ని విధాలా న్యాయం చేయాలి

పావగడ, జనవరి 6: తుమకూరు జిల్లా వ్యాప్తంగా వర్షాభావంతో పంటలు నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని తుమకూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షులు గోవిందరాజు తెలియజేశారు. శనివారం పావగడ పట్టణంలోని ఐబీలో నిర్వహించిన రైతు సంఘం ఆధ్వర్యంలో ఆయన మాట్లాడుతూ ఈవిషయాన్ని వెల్లడించారు. తాలూకా సంఘం అధ్యక్షుడు పూజారప్ప తదితరులు పాల్గొన్నారు.



ఆదిరెడ్డిపాళ్యంలో గ్యారెంటీ కార్డులను అందజేస్తున్న టీడీపీ నాయకులు



మల్లినమడుగులో పర్యటిస్తున్న డాక్టర్ కృష్ణమూర్తి తదితరులు

రాష్ట్రాన్ని గట్టెక్కించే ఏకైక నాయకుడు చంద్రబాబు

భవిష్యత్తుకు గ్యారెంటీ ప్రచారంలో టీడీపీ నాయకులు

మడకశిరటౌన్, జనవరి 6: రాష్ట్రాన్ని ప్రస్తుతమున్న క్లిష్టపరిస్థితుల నుంచి గట్టెక్కించే ఏకైక నాయకుడు చంద్రబాబు అని టీడీపీ నియోజకవర్గం మీడియా కోఆర్డినేటర్ రవికుమార్, నాయకులు మల్లికార్జున తదితరులు అన్నారు. వారు శనివారం పట్టణంలోని ఆదిరెడ్డిపాళ్యంలో బాబు ష్యూరిటీ భవిషత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు ప్రతి ఇంటి వద్దకు వెళ్లి సంబంధిత కరపత్రాలను అందించి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక చేపట్టే కార్యక్రమాలను వివరించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రొళ్ల: మండలంలోని మల్లినమడుగు గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని టీడీపీ డాక్టర్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కొంకల్లు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు జగన్నాథ్, హనుమక్క, సుమ, రంగతాయి, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: పట్టణంలోని నాలుగో వార్డులో టీడీపీ నాయకులు మాజీ ఉపసర్పంచ సుబ్బరాయుడు, మైనార్టీ యువనాయకుడు ఉమ్మర్‌ఖాన్ ఆధ్వర్యంలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీపై ప్రచారం నిర్వహించారు. సంత బజారు, పులేరు వీధి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పార్టీ భవిష్యత్తులో చేపట్టబోయే సంక్షేమపథకాలు వివరించారు.



గోరంట్లలో ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

నిరుద్యోగులను నట్టేట ముంచిన జగన్

తెలుగుయువత నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న తెలుగుయువత నాయకులు

గోరంట్ల, జనవరి 6: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం జాబ్‌క్యాలెండర్‌ను సమాధి చేసి నిరుద్యోగులను నట్టేట ముంచిదని, తెలుగుయువత నాయకులు ధ్వజమెత్తారు. వారు శనివారం గోరంట్లలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రెండులక్షల 30వేలు ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న వాగ్దానంతో గద్దెనెక్కిన జగన్మోహన్‌రెడ్డి, ఆ తరువాత యువతను మోసం చేశారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకపోగా... డ్రగ్స్, గంజాయి, మద్యం లాంటి వాటితో మత్తుకు యువత బానిసై నాలుగేళ్లలో 21,571మంది ఆత్మహత్య చేసుకోవడానికి అవకాశం కల్పించిందన్నారు. జాబ్ రావాలంటే బాబురావాలన్న నినాదంతో వైసీపీని వచ్చే ఎన్నికల్లో భూస్థాపితం చేస్తామన్నారు. ఈ సమావేశంలో తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి ఎగువింటి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆంబులెన్స్ రమేష్, రాష్ట్ర కార్యదర్శి నరేష్ కుమార్‌యాదవ్, కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, శ్రీధర్, నవీన్, మణిశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల అరెస్ట్



పారిశుధ్య కార్మికులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

పెనుకొండ, జనవరి 6: సమస్యల పరిష్కారం కోరుతూ నగర పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె 12వ రోజుకు చేరుకుంది. సమ్మె కారణంగా పట్టణంలోని వీధులన్నీ చెత్తకుప్పలతో నిండిపోయాయి. శనివారం పెనుకొండకు వచ్చిన మంత్రి ఉశశ్రీ చరణ్ ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌కు వెళ్తుండటంతో ఆ ప్రాంతంలోని చెత్తను తాత్కాలిక కార్మికులతో శుభ్రం చేయిస్తుండగా వారిని సమ్మెలో ఉన్న కార్మికులు అడ్డుకున్నారు. ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు కలగజేసుకుని సమ్మె చస్తున్న వారిని అరెస్ట్‌చేసి సోమందేపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆ ప్రాంతాన్ని తాత్కాలిక కార్మికులతో శుభ్రం చేయించారు.

4వ రోజు కొనసాగిన ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

హిందూపురం, జనవరి 6: డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మునిసిపాలిటీలోని ఇంజనీరింగ్ విభాగం సభ్యులు చేపడుతున్న సమ్మె 4వ రోజుకు చేరింది. ఏఐటీయుసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ ప్రభుత్వం దిగి రాకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే సీఐటీయూ ఆధ్వర్యంలో 12వ రోజుకూడా మునిసిపల్ కార్యాలయంలో నిరసన శిబిరంలో ఆందోళన చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించక పోతే ఎక్కడి చెత్త ఆగిపోయేలా చేస్తామని హెచ్చరించారు.

అంగన్‌వాడీలపై ఎస్మా దారుణచర్య

టీడీపీ జిల్లా కార్యదర్శి ఎస్ రవిభూషణ్

రొళ్ల, జనవరి 6: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బందిపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా అమలు చేయడంపై దారుణ చర్య అని టీడీపీ జిల్లా కార్యదర్శి రవిభూషణ్ రాష్ట్ర ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన శనివారం టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అంగన్‌వాడీలకు ఎక్కువ వేతనం ఇచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే అంగన్‌వాడీల అన్ని డిమాండ్లు అమలు చేస్తారని అన్నారు.

కార్మిక కష్టాలు ప్రభుత్వానికి పట్టవా..?

బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములు

హిందూపురం అర్బన్, జనవరి 6: పారిశుధ్య కార్మికులు లేకపోతే పల్లె, పట్నం, నగరం తేడా లేకుండా ఊరువాడి కంపుపట్టి పోతాయని బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములు అన్నారు. కార్మికుల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా అని ప్రశ్నించారు. స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో ఆయన పారిశుధ్య కార్మికుల సమ్మెకు మద్దతు పలికారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ కార్యదర్శి సడ్లపల్లినారాయణప్ప. కోశాధికాంరి నారాయణ, నాగరాజుస్వామి, చిరంజీవి, దాసరి ఈశ్వరయ్య, మౌలాలి, కిష్టప్ప, రవికుమార్, అంజినప్ప, ఆటో నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.